సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 28 । మే । 2025



తవ్వేస్తున్నా.. మొద్దు నిద్రే

ద్వారకాతిరుమల మండలం పోలవరం కుడి కాలువ గట్టుపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నా అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు. 8లో ▸



జీలుగ సాగుతో పంటలు బాగు

పచ్చిరొట్ట ఎరువు పంటల్లో జీలుగ మంచి ఫలితాలనిస్తుండడంతో రైతులు జీలుగ సాగుకు మొగ్గు చూపుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. 8లో ▸



వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్

జాతీయ రహదారిపై దెందులూరు హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద మంగళవారం వ్యాన్‌ను కంటైనర్ లారీ ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

ముగిసిన ఈఏపీ సెట్



తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

భీమవరం: ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. భీమవరం పట్టణంలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 19, 20 తేదీల్లో ఏపీ అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించగా ఈ నెల 21 నుంచి మంగళవారం వరకు ఇంజినీరింగ్ ఎంట్రన్స్ పరీక్షలు జరిగాయి. మంగళవారం పరీక్షకు పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 170 మందికి 165 మంది హాజరుకాగా, విష్ణు ఉమెన్స్ కళాశాలలో ఉదయం 87 మందికి 85 మంది, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 110 మందికి 106 మంది హాజరయ్యారు. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం 100 మందికి 94 మంది, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 100 మందికి 99 మంది హాజరయ్యారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం: పెద తాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 228 మందికి 221 మంది హాజరయ్యారు. ఈ కేంద్రంలో ఇంతవరకూ 3239 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 3061 మంది పరీక్షకు హాజరయ్యారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 65 శాతం హాజరు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 65 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. 139 మంది విద్యార్థులకు 48 మంది గైర్హాజరయ్యారన్నారు. 7 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నారాయణ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్డీ

భీమవరం (ప్రకాశంచౌక్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ సమావేశాలకు గైర్హాజరవుతున్న మున్సిపల్ అధికారులపై, నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శాఖ రీజనల్ డైరక్టర్ సీహెచ్ నాగ నర్సింహరావు హెచ్చరించారు. మంగళవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయా మున్సిపాలిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై ఆరా తీశారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై స్థానికంగా ఉన్న కమిషనర్లు సస్పెండ్ వరకూ చర్యలు తీసుకోవాలన్నారు. భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు మున్సిపాలిటీలకు సంబంధించి కమిషనర్లు, రెవెన్యూ అధికారులు ప్లానింగ్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

భీమవరం: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి జూన్ 1 వరకు జరుగుతాయని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. జనరల్ కేటగిరిలో 27 మంది, ఒకేషనల్‌లో 99 మంది హాజరుకానున్నారని. జనరల్ విద్యార్థులకు శ్రీగ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాల, ఒకేషనల్ విద్యార్థులకు ప్రశాంతి ఒకేషనల్ జూనియర్ కళాశాల, పెనుగొండలోని ఎస్‌వీకేపీ అండ్ పీవీ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేసినట్లు నాగేశ్వరరావు తెలిపారు.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2025–26 అడ్మిషన్లలో భాగంగా ప్రత్యేక కేటగిరీ సీట్ల భర్తీకి ఈ నెల 28 నుంచి 31 వరకు సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. ఇందుకోసం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాట్లు చేశారు. 28న సైనికోద్యోగుల పిల్లల (సీఏపీ) కోటాలో 153 మంది, క్రీడా కోటాలో 320 మంది కలిపి మొత్తం 473 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. 29న సీఏపీ కోటాలో 117, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 247, ఎన్‌సీసీ కోటాలో 341, క్రీడా కోటాలో 245 మొత్తం కలిపి 950 మంది సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. 30న ఎన్‌సీసీ కోటాలో 452, క్రీడా కోటాలో 467, మొత్తం 919 మంది, 31న ఎన్‌సీసీ కోటా అభ్యర్థులు 661 మంది సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు.

కరోనా కలకలం

- ఏలూరులో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్
- అప్రమత్తంగా లేని యంత్రాంగం.. ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ కిట్లు నిల్
- మహానాడు హడావుడిలో కూటమి సర్కారు
- బదిలీల సందడిలో ప్రభుత్వ ఉద్యోగులు



ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరులో జిల్లాలో ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. నగరంలో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగులకు కోవిడ్ సోకింది. మరోవైపు అనేక మంది జ్వరాల బారిన పడుతుండటంతో మరిన్ని కోవిడ్ కేసులు ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో కడప, విశాఖపట్నంలో మూడు రోజుల క్రితమే కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా తాజాగా ఏలూరులో కేసులు నమోదయ్యాయి. అయితే కోవిడ్ అప్రమత్తతలో మాత్రం జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. నిబంధనలు పాటించమని ప్రకటనలు తప్ప, అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు కూడా చేయడం లేదు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మొదలుకొని చింతలపూడి, నూజివీడుతో సహా అన్ని ఏరియా ఆసుపత్రుల్లో కనీసం కోవిడ్ టెస్టింగ్ కిట్లు అందుబాటులో లేవు. కరోనా లక్షణాలు ఉంటే.. బాధితులు ప్రభుత్వాసుపత్రికి వెళ్తే కరోనా పరీక్షలు చేస్తారా? అసలు కిట్లు అందుబాటులో ఉన్నాయా? ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారా? ఇలా అనేక ప్రశ్నలకు లేదనే సమాధానం వినిపిస్తోంది.

ఏలూరు నగరంలో కోవిడ్ కలకలం

ఏలూరు నగరంలోని శాంతినగర్ 7వ రోడ్డులో ఉంటున్న ఇద్దరు దంపతులకు కరోనా పాజిటివ్ వచ్చిందనే వార్త ఏలూరు నగరంలో కలకలం సృష్టిస్తోంది. వీరు ఏలూరులో ఉంటుండగా... పిల్లలు విదేశాల్లో ఉంటున్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా .. గుంటూరు జిల్లా మణిపాల్ హాస్పిటల్‌లో యాంజియోప్లాస్టీ చికిత్స చేయించుకునేందుకు వెళ్ళారు. ఈ నేపథ్యంలో వివిధ పరీక్షలు చేస్తుండగా కోవిడ్–19 టెస్ట్ చేశారు. ఈ పరీక్షలో కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణయ్యింది. అనంతరం భర్తకు కూడా కోవిడ్ పరీక్ష చేయగా ఆయనకు కరోనా పాజిటివ్‌గా తేల్చారు. వీరికి మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య అధికారులు స్పష్టం చేశారు.

వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కరోనా ముందుస్తు చర్యలు చేపట్టకుండా, ప్రజలను అప్రమత్తం చేయకుండా తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే.. జిల్లాలోని ఇతర ప్రాంతాలను ఎవరు పట్టించుకుంటారని అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది.



టీడీపీ మహానాడు హడావుడిలో..

రాష్ట్ర వ్యాప్తంగా కరోనా కేసులు నమోదు అవుతున్నా... టీడీపీ మహానాడు, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో ఎవరూ అధికారంగా స్పందించడం లేదు. మహానాడుపై ప్రభావం చూపించకుండా ఉండేందుకే ఇలా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మహానాడుకు టీడీపీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివెళ్ళే అవకాశం ఉండడంతో కరోనా విజృంభించేందుకు అవకాశముంది.

కరోనా కిట్లు నిల్

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కరోనా విజృంభిస్తోన్న తరుణంలో ఏలూరు జీజీహెచ్‌లో వైద్యులు ఎంతో మెరుగైన వైద్య చికిత్సలు అందించి అనేక మంది ప్రాణాలు నిలబెట్టారు. నిత్యం కరోనా పరీక్షలు చేయడంతో పాటు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజల ప్రాణాలకు భరోసాగా నిలిచారు. నేడు కూటమి ప్రభుత్వంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందితే తీసుకోవాల్సిన ముందుస్తు చర్యలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవటం గమనార్హం. జిల్లాలో కనీసం కరోనా పరీక్షలు చేసేందుకు కిట్లు సైతం లేకపోవడంతో అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఎలా అన్న ప్రశ్న వినిపిస్తోంది.

గ్రామాల్లో చెత్త తొలగింపు



తూర్పు విప్పర్రులో కాలువల పక్కన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

ఇరగవరం: 'గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన గత సోమవారం సాక్షిలో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామాల్లోని చెత్తను ట్రాక్టర్లలో డంపింగ్ యార్డులకు తరలించారు. కార్యదర్శులకు ఈవోపీఆర్డీ నరసింహ మూర్తి ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశాలిచ్చారు. గ్రామాల్లో చెత్త తొలగించడంతో ప్రజలు హర్షం చేశారు.

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పరిశ్రమల కోసం దరఖాస్తులను గడువులోగా పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలని జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన చాంబరులో పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతూ యువతకు పారిశ్రామిక యూనిట్ల స్థాపనపై అవగాహన కల్పించాలన్నారు. రైసు మిల్లులు, ఆక్వా, కాయిర్ సెక్టారుకు సంబంధించి ఉత్పత్తులు, ఎగుమతుల అవకాశాలు చర్చించేందుకు వర్క్‌షాపు నిర్వహించాలన్నారు .

● మద్యం మత్తులో చిత్తు



విచ్చలవిడి మద్యం విక్రయాలతో మందుబాబులే కాకుండా మహిళలు మద్యం సేవించి ఒళ్లు తెలియకుండా రోడ్ల మీద పడిపోతున్నారు. మంగళవారం రాత్రి భీమవరం రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఒక యువతి ఫుల్‌గా మద్యం తాగి రోడ్డుకు అడ్డుగా పడుకుని హల్‌చల్ చేసింది. ఫ్లైఓవర్‌పై అడ్డంగా పడుకోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఆ యువతికి వాహనదారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించినా వినిపించుకోలేదు. – భీమవరం

తణుకులో కోవిడ్ కేసు?

తణుకు అర్బన్: తణుకులో వృద్ధురాలికి కోవిడ్ సోకినట్లు వార్తలు రావడంతో కలకలం రేగింది. ప్రైవేటు ఆస్పత్రిలో ఒక మహిళ కోవిడ్‌తో చికిత్స పొందుతున్నారన్న వార్త సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. పైడిపర్రుకు చెందిన వృద్ధురాలు ఇటీవల యాత్రలకు వెళ్లి వచ్చాక అనారోగ్యం బారిన పడ్డారని.. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా కోవిడ్ లక్షణాలుగా ఉండడంతో ఆస్పత్రి యాజమాన్యం వెంటనే ఏలూరు లేదా కాకినాడ వెళ్లి పరీక్ష చేయించుకోవాల్సిందిగా సూచించినట్లుగా తెలుస్తోంది.

గోదావరిలో ముగ్గురు బాలుర గల్లంతు

- ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక వద్ద ఘటన
- స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిన బాలురు
- గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు



ఆచంట మండలం రావిలంక వద్ద ప్రమాదం జరిగిన ప్రాంతం



గోదావరిలో గల్లంతైన సూర్యతేజ, పవన్‌కుమార్, ప్రవీణ్



సహాయ చర్యలు పర్యవేక్షిస్తున్న ఎస్పీ

పెనుగొండ: కోనసీమలో గోదావరిలో ఎనిమిది మంది యువకుల గల్లంతు వార్త మరువక ముందే.. ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక వద్ద స్నానానికి దిగిన బాలురలో ముగ్గురు గల్లంతవడం తీవ్ర విషాదం నింపింది. మంగళవారం సాయంత్రం ముగ్గురు బాలురు గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా గన్నవరం మండలానికి చెందిన కేతా ప్రవీణ్(15), సానబోయిన సూర్యతేజ(12), పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలికి మండలం పెదలంకకు చెందిన నీతిపూడి పాల్ కుమార్(15) స్నేహితులతో కలసి గత కొన్ని రోజులుగా గోదావరి స్నానానికి వస్తున్నారు. ఇదే కోవలో మంగళవారం మధ్యాహ్నం మరో ఇద్దరు స్నేహితులతో కలిసి స్నానానికి దిగారు. ప్రమాదవశాత్తు ప్రవీణ్, సూర్యతేజ, పాల్ కుమార్ మునిగిపోవడంతో మిగిలిన ఇద్దరు భయపడి వెంటనే బంధువులకు సమాచారం అందించారు. కేతా ప్రవీణ్, పాల్‌కుమార్ ఇటీవల పదో తరగతి పరీక్షలు పూర్తిచేశారు.

పేద కుటుంబాల్లో పెను విషాదం


గల్లంతైన ప్రవీణ్ తండ్రి వెంకటేశ్వరరావు తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సూర్యతేజ తండ్రి ఏడుకొండలు వడ్రంగి మేస్త్రీ.. పాల్‌కుమార్ తండ్రి మృతి చెందడంతో తల్లి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. ముగ్గురు బాలురు గల్లంతుతో సంఘటన ప్రాంతంలో విషాదం నెలకొంది. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మీ, నర్సాపురం డీఎస్పీ డాక్టర్ వేద, పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర ఎస్సైలు సంఘటన స్థలానికి చేరుకుని సహాయ చర్యలు పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన ముగ్గురు బాలుర కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పూడికతీత తూతూమంత్రమేనా?

- గురపుడెక్క, కిక్కిస, వ్యర్థాలతో కుచించుకుపోయిన డ్రెయిన్లు
- జిల్లాలో 349 పూడికతీత పనులకు రూ.14 కోట్ల మంజూరు
- నీటి సంఘాలు మాటున కూటమి నేతలకే పనులు
- సకాలంలో మొదలుపెట్టకుండా నామమాత్రంగా చేసే ఎత్తుగడ

తొలకరి సాగుకు ఊతమిస్తూ రుతుపవనాలు వచ్చేశాయి. త్వరలో కాలువలకు నీరు విడుదల కానుంది. కోటి ఆశలతో ఏరువాక సన్నాహాల్లో రైతులను డ్రెయిన్లు గురప్రుడెక్క, కిక్కిస, వ్యర్థాలు, ఆక్రమణలతో కుంచించుకుపోయి కలవరపరుస్తున్నాయి. సాగుకాలం సమీపిస్తున్నా చాలాచోట్ల పూడికతీత పనులు ఇంకా మొదలుకాలేదు.

భీమవరంలో గుర్రపుడెక్కతో నిండిపోయిన గునుపూడి సౌత్ డ్రెయిన్



పాలకోడేరు, భీమవరం మండలాల్లో ప్రధానమైన గునుపూడి సౌత్ డ్రెయిన్ గురప్రు డెక్క, వ్యర్థాలతో పూడుకుపోయింది. భారీ వర్షాలు కురిసినప్పుడు నీటి ప్రవాహవేగాన్ని గురప్రుడెక్క అడ్డుకుని సకాలంలో ముంపునీరు లాగక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఏటా ఇదే పరిస్థితి ఉంటున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

పెంటపాడు మండలంలో పూడికతో నిండిపోయిన బక్లెస్ డ్రెయిన్



పెంటపాడు మండలంలో పెద్దదైన బక్లెస్ డ్రెయిన్ పూడికతీత పనులు జరగక ముంపు బెడద వెంటాడుతోంది. ప్రధాన పంట కాలువలైన మిడ్ లెవెల్, లో లెవెల్ కాలువల ద్వారా సాగయ్యే పొలాల ముంపు నీరు బక్లెస్ డ్రెయిన్ ద్వారా పందికోడులో కలిసి కొల్లేరులోకి వెళ్లాలి. పూడిక, దిగువ ప్రాంతంలో ఆక్రమణలతో ముంపునీరు లాగక ఏటా వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి.

అత్తిలి మండలంలో పూడికతో నిండిపోయిన ఆరుదల కోడు డ్రెయిన్



అత్తిలి మండలంలో ఈర్లకోడు, రాచకోడు, ఆరుదల కోడు మూడు ప్రధాన డ్రెయిన్ల పరిధిలో ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అత్తిలి, తణుకు రూరల్‌లోని ఆయకట్టు మురుగునీరు అంతా వీటి ద్వారానే యనమదుర్రు డ్రెయిన్‌లో కలవాలి. ఇవి ఎక్కడికక్కడ పూడుకుపోయి ఉండటంతో మురుగునీరు పారక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సాక్షి, భీమవరం: జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, ఆకివీడు సబ్‌డివిజన్లలో బొండాడ, గునుపూడి సౌత్, గొంతేరు, భగ్గేశ్వరం, మొగల్తూరు, కాజా, రుద్రయ్య కోడు తదితర 294 కిలోమీటర్ల పొడవున 13 మేజర్ డ్రెయిన్లు ఉన్నాయి. 330 కిలోమీటర్లు పొడవున 41 మీడియం డ్రెయిన్లు, 956 కిలోమీటర్లు పొడవున 454 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. వీటిలో గురప్రుడెక్క, తూడు పెరిగిపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. తుపాన్లు ఏర్పడినప్పుడు రోజుల తరబడి ముంపు నీరు లాగక పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ముంపునీటిని బయటకు పంపేందుకు రైతులు అగచాట్లు పడాల్సి వస్తోంది. ఏటా తొలకరి సాగు ప్రారంభానికి ముందే డ్రెయిన్లలో గురప్రు డెక్క, కిక్కిస తొలగింపు పనులు పూర్తి చేస్తుంటారు.

రూ. 14 కోట్లు మంజూరు:

రానున్న వ్యవసాయ సీజన్‌కు గురప్రుడెక్క తొలగింపు, పూడికతీత నిమిత్తం సుమారు రూ.17 కోట్లు విలువైన 370కు పైగా పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. 349 పనులకు ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. వీటిలో 270 వరకు గురప్రుడెక్క తొలగింపు, మిగిలినవి పూడికతీత పనులు ఉన్నాయి.

ఈ నిధులతో సాగుకు ముందే పూడిక సమస్యను పరిష్కరించడంతో పాటు ఏడాదిపాటు డ్రెయిన్ల నిర్వహణ చేయాలి. ప్రాజెక్టు కమిటీ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, నీటిసంఘాల మాటున నామినేషన్ పద్ధతిపై కూటమి నేతలు పనులు దక్కించుకున్నారు. సాగుకాలం ముంచుకొస్తుండగా చాలామంది ఇంకా పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. తూతూమంత్రంగా పనులు చేసేందుకు కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై డ్రెయిన్స్ ఈఈ సత్యనారాయణను సంప్రదించగా పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వర్షాల వలన కొన్నిచోట్ల స్ప్రేయింగ్ పనులు ఇంకా మొదలుకాలేదని, త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గత ఏడాది వెంటాడిన ముంపు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది నెల రోజులు ఆలస్యంగా పనులు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 2.15 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షాలతో డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. పూడికతో ముంపు నీరు లాగక 14 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరాలకు చెందిన నారుమడులు దెబ్బతినడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది.

పూడిక తొలగించాలి



బక్లెస్ డ్రెయిన్ ముంపుతో తీవ్రంగా నష్టపోతున్నాం. సార్వాకు ముంపు బెడద లేకుండా డ్రెయిన్‌లోని ప్రక్షాళన చేయాలి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నాచు, గురప్రుడెక్క తొలగింపు పనులు చేయించాలి.

– తోరం వెంకట సుబ్బయ్య, రైతు, పడమర విప్పర్రు

త్వరితగతిన పనులు చేపట్టాలి



తొలకరి పనులు మొదలయ్యే నాటికి డ్రెయిన్లలో పూడికతీత పనులు పూర్తిచేయాలి. అలాగే యనమదుర్రు డ్రెయిన్ పూడిక ప్రధాన సమస్యగా ఉంది. ఆక్రమణలు, పూడిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– తోలేటి వెంకటేశ్వరరావు, రైతు, తిరుపతిపురం

ఎర్ర గ్రావెల్ తవ్వేస్తున్నా.. మొద్దు నిద్రే

- పోలవరం కుడి కాలువగట్టుపై ఏకంగా గ్రావెల్ క్వారీలు
- మట్టి ముసుగులో యథేచ్ఛగా ఎర్ర గ్రావెల్ తవ్వకాలు
- నిద్ర నటిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం


ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై భూమిని తవ్వుతున్న పొక్లెయిన్

ద్వారకాతిరుమల: అవినీతి అధికారులు ఉన్నంత వరకు అక్రమార్కులకు అడ్డేలేదు అనడానికి పోలవరం కుడి కాలువ గట్టుపై జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలే నిదర్శనం. నామమాత్రపు అనమతులను అడ్డం పెట్టుకుని ఏకంగా క్వారీలు ఏర్పాటు చేశారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా భూమిని తవ్వేస్తూ.. ఎంతో విలువైన ఎర్ర గ్రావెల్‌ను అమ్మేస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్ల మట్టిని తరలించేస్తున్నారు. కొందరు రైతులు తమ పొలాల వద్ద గోతులు తవ్వేస్తున్నారని గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకునే నాథుడు లేడు. ముడుపుల మత్తులో జిల్లా అధికార యంత్రాంగం నిద్ర నటించడమే ఇందుకు కారణమని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. ఇంతటి అరాచక పాలనను, లెక్కలేని అధికారుల తీరును మునుపెన్నడూ చూడ లేదని వాపోతున్నారు.

మళ్లీ పూడ్చేస్తాములే..

కాలువ తవ్విన సమయంలో గట్టుపై వేసిన మట్టిని బయటకు తోలుకునేందుకు మూడు కంపెనీలకు ఇరిగేషన్, మైనింగ్ అధికారులు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారు. అయితే గట్టుపై ఉన్న మట్టిని కాకుండా, భూమిని తవ్వి ఎంతో విలువైన ఎర్ర గ్రావెల్‌ను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దాంతో తవ్వకాలు జరిగిన ప్రాంతాలు క్వారీలను తలపిస్తున్నాయి. తమ పొలాలకు వెళ్లే మార్గాల్లో గుంతలు తవ్వేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాలు జరుపుతున్న వారిని ప్రశ్నిస్తే.. మళ్లీ పూడ్చేస్తాములే అని సమాధానం చెబుతున్నారట. వర్షాలకు గోతులు నిండిపోయి అందులో రైతులు గాని, పశువులు గాని పడి మృత్యువాత పడితే దానికి ఎవరు బాధ్యులు. తవ్వకాలు జరుపుతున్న వారా.. లేక అధికారులా.. అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.


గ్రావెల్ తవ్వకాల అనంతరం ఒక గొయ్యిని కాలువ మట్టితో పూడ్చుతున్న పొక్లెయిన్, జేసీబీలు


టిప్పర్‌లో గ్రావెల్ కనబడకుండా గ్రీన్ క్లాత్ కట్టి రవాణా

మొక్కుబడిగా పూడిక..

గట్టుపై మట్టి తవ్వకాలు ముసుగులో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఇటీవల సాక్షిలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దాంతో ఉలిక్కిపడ్డ అక్రమార్కులు తమ తప్పులను అధికారుల సూచనలతో కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం పంగిడిగూడెం వద్ద గ్రావెల్ తవ్వగా ఏర్పడిన గోతులను, గట్టుపై ఉన్న మట్టితో మొక్కుబడిగా పూడ్చుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గోతులు పూడ్చుతున్నామని చెబుతున్నారు. అసలు గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఎవరిచ్చారు, ఇప్పటి వరకు తవ్విన గోతుల సంగతి ఏమిటన్న ప్రశ్నలకు వారి వద్ద సమాధానం లేదు.

ముసుగులతో రవాణా..

కూటమి నేతలు ఎంతో విలువైన గ్రావెల్‌ను అక్రమంగా అమ్మేస్తున్నారని, అధికారులు వారికి కొమ్ము కాస్తున్నారని జిల్లా వ్యాప్తంగా తెలిసిపోయింది. దాంతో టిప్పర్లలోని గ్రావెల్ బయటకు కనబడకుండా గ్రీన్ క్లాత్‌లు కట్టి మరీ రవాణా చేస్తున్నారు. నిత్యం వందలాది టిప్పర్ల మట్టి ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు తరలిపోతోంది.

ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు

పంగిడిగూడెం వద్ద నాకు ఉన్న పొలానికి వెళ్లే దారిలో గోతులు తవ్వేస్తున్నారని ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫోన్‌లో ఫిర్యాదులు చేశాను. అయినా వారు పట్టించుకోలేదు. కూటమి నేతలకు ఎదురు తిరిగి నిలబడలేను. ఎందుకంటే వారి వెనుక ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారు. నా కష్టాన్ని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. మిగిలిన రైతుల పరిస్థితి కూడా ఇదే.

– భీమడోలుకు చెందిన ఓ రైతు

ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు

కాలువ గట్టుపై ఉన్న మట్టిని విడిచిపెట్టి, క్వారీలు తవ్వుతూ కూటమి నేతలు కోట్లు గడిస్తున్నారు. ఆ డబ్బుతో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. అందుకే అధికారులు సైతం అక్రమార్కులకు తొత్తుల్లా మారారు. ఇంత దారుణాన్ని ఎప్పుడూ చూడలేదు. ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం వద్ద పచ్చ నేతలు, జనసేన నాయకుడి కనుసన్నల్లో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి.

– ఎం.నాగులపల్లికి చెందిన ఓ రైతు

నిర్వాసితులను తరలించేందుకు ప్రత్యేక చర్యలు

పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్


బుట్టాయగూడెంలో విలేకర్లతో మాట్లాడుతున్న పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న ఫేజ్ బి పరిధిలో ఉన్న నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి వారిని తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ బి.అభిషేక్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాటాడారు. రెండో దశలో సుమారు 32 గ్రామాల్లో 13,700 మంది నిర్వాసితులు ఉన్నారన్నారు. వీరందరికీ వీఆర్‌పురం, కూనవరం పరిధితోపాటు కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో నిర్వాసితులకు అనుకూలమైన భూములను సేకరించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. వీరికి నిర్వాసిత గ్రామాలు నిర్మించడంతోపాటు భూమికి భూమిగా కూడా భూసేకరణ చేయడం జరుగుతుందని చెప్పారు. నిర్వాసితులు కోరుకున్న ప్రదేశంలో ఇళ్ల నిర్మించడంతోపాటు వ్యవసాయ భూములను కూడా సేకరించేలా కృషి చేస్తామని చెప్పారు. గిరిజనులకు నివాసాలు కల్పించడంతో పాటు భూములను కూడా సేకరించి ఇచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. వారు కోరుకున్న ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూములను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియ నెలరోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రమణ, తహసీల్దార్ పీవీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అటెండర్ మృతి


ఘటనా స్థలంలో సుబ్బారావు మృతదేహం

నూజివీడు: నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న బలుమూరి సుబ్బారావు(59) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. సబ్‌కలెక్టర్‌కు అటెండర్‌గా పనిచేస్తున్న ఆయన స్వగ్రామమైన కృష్ణా జిల్లా గన్నవరం మండలం గోపవారిగూడెంలో ఉంటున్నారు. నిత్యం అక్కడి నుంచే విధులకు హాజరై మరలా ఇంటికి వెళ్తారు. రోజూ మాదిరిగానే ఇంటి వద్ద నుంచి నూజివీడులోని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి విధి నిర్వహణ నిమిత్తం మంగళవారం ద్విచక్రవాహనంపై వస్తుండగా ఉదయం 7.45 గంటల సమయంలో కొన్నంగుంట రోడ్డులో అమృతనగర్ స్టేజీ వద్ద వ్యాన్ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అటెండర్ సుబ్బారావు మృతి వార్త తెలుసుకున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం సుబ్బారావు భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రూరల్ ఎస్సై జీ జ్యోతీబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం: ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆదివాసీ ప్రాంతంలో నూరుశాతం ఉపాధ్యాయ పోస్టులు గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో డీఎస్సీలో ఉపాధ్యాయుల పోస్టులను మినహాయించి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసీ అభ్యర్థులతో ఆ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో తెల్లం లక్ష్మి, కలుం వెంకటేశ్వరి, ఎం శాంతి కుమారి, పి.భవాని, పి.నాగరత్నం, జి. కృష్ణారెడ్డి, సీహెచ్ మల్లీశ్వరి, కె.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో అగ్నిప్రమాదం


టౌన్ స్టేషన్ ఆరుబయట విద్యుత్ మీటరుకు మంటలు అంటుకున్న దృశ్యం


కాలి బూడిదగా మారిన విద్యుత్ మీటరు

కైకలూరు: స్థానిక టౌన్ పోలీసు స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఆరుబయట విద్యుత్ మీటరు నుంచి ఒక్కసారిగా భారీ మంటలు వ్యాపించాయి. ఏం జరుగుతుందో తెలీయక అందరూ ఆయోమయంలో పడ్డారు. మంటలు వ్యాపించిన మీటరు సమీపంలో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. మరో వైపున పోలీసుశాఖ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకు ఉంది. తేరుకున్న పోలీసులు వెంటనే మంటలను ఆదుపు చేశారు. ప్రమాదం విషయమై విద్యుత్‌శాఖ లైన్‌మెన్ ఆనందరావును వివరణ కోరగా పోల్ నుంచి వచ్చిన మెయిన్ సర్వీసు వైరులో ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ఏసీలు వంటివి అధిక లోడ్ తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. విద్యుత్ మీటరు కాలిపోవడంతో స్టేషన్ అంధకారమైంది. సమీప మీటరు నుంచి తాత్కలికంగా విద్యుత్‌ను పునరుద్ధరించారు.

హౌసింగ్ శాఖలో అవకతవకలపై చర్యలు

దెందులూరు: హౌసింగ్ శాఖలో ఐరన్, సిమెంట్ బస్తాల చోరీ, అవకతవకలపై జిల్లా కలెక్టర్ చర్యలు ప్రారంభించారు. ఇటీవల హౌసింగ్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ హౌసింగ్ శాఖలో జిల్లా వ్యాప్తంగా జరిగిన చోరీ, అవకతవకలపై కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. దీంతో దెందులూరు నియోజకవర్గంలో పెదవేగి మండలంలో గోడౌన్ ఇన్‌చార్జి నాగరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చిన్నబాబులను విధుల నుంచి కలెక్టర్ తొలగించారు. దెందులూరు మండలంలో చోరీపై డివిజనల్ ఇంజనీర్ దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్ ద్వారా చోరీకి పాల్పడిన వ్యక్తులు, వాహనం గుర్తించి దెందులూరు ఎస్సైకు ఆధారాలతో సహా అందజేశారు. దీంతో పెదవేగి మాదిరిగానే దెందులూరులోను కఠిన చర్యలు తప్పవని జిల్లా అధికారులు వివరించారు.

వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్


ప్రమాదానికి గురైన వ్యాన్


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ఆరుగురికి స్వల్పగాయాలు

దెందులూరు: వ్యాన్‌ను కంటైనర్ లారీ ఢీకొనడంతో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై దెందులూరు హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా పామర్రు నుంచి తూర్పు గోదావరి జిల్లా వాడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఒకే కుటుంబానికి చెందిన 15 మంది వ్యాన్‌లో వెళ్తున్నారు. దెందులూరు హెచ్‌పీ పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి గుండుగొలను వైపు వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 15 మందిలో ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా మిలిలిన వారు క్షేమంగా బయటపడ్డారు. క్షతగాత్రులను వెంటనే దెందులూరు సీహెచ్‌సీకి 108 అంబులెన్స్‌లో తరలించారు. కాగా వ్యాన్‌ను ఢీకొట్టి వెళ్లిపోయిన కంటైనర్‌ను సత్యనారాయణపురం వద్ద గ్రామస్తులు నిలుపుదల చేసి తాళాలు తీసుకున్నారు. అయితే డ్రైవర్ వద్ద మరో తాళం ఉండడంతో కంటైనర్‌తో పరారయ్యాడని ఎస్సై శివాజి చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం: ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ ఎస్సై రెహమాన్ చెప్పారు. భీమవరం రూరల్ మండలం రాయలం గ్రామంలో సోమవారం 10 ఏళ్ల బాలిక తోటి పిల్లలతో ఆడుకుంటుండగా అడిదెల రంగనాథ్ స్వీట్లు ఇస్తానని చెప్పి తన ఇంటిలోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. తల్లికి బాలిక విషయం చెప్పగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉపాధి హామీ పనులను తనిఖీ చేయాలి

కలెక్టర్ ఉత్తర్వులు జారీ

సాక్షి స్పందన

నూజివీడు: ఉపాధి హామీ పనుల్లో తప్పుడు మస్టర్ నమోదు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మండలాల్లో ప్రోగ్రాం ఆఫీసర్లు ఉపాధి హామీ పనుల నిర్వహణలో చురుగ్గా వ్యవహరించాలని కలెక్టర్ కే వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేసినట్లు డ్వామా పీడీ వెంకట సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మస్టర్లలో మాయాజాలం' పేరుతో ఉపాధిహామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలను 'సాక్షి' మంగళవారం ప్రచురించడం జరిగింది. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రోగ్రాం ఆఫీసర్లు తప్పనిసరిగా మస్టర్లు తనిఖీ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. నూజివీడు మండలంలో జిల్లా విజిలెన్స్ అధికారి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సంయుక్తంగా విచారణ నిర్వహించారని, వారి నుంచి నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించి ఎక్కువమంది శ్రామికులకు పని కల్పించి వారు ఆశించిన వేతనలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం విజయవంతంగా నిర్వహించబడుతుందని, గతేడాది కోటి 20 లక్షల పని దినాల లక్ష్యానికి కోటి 23 లక్షల 65 వేల పనిదినాలు కల్పించి 103 శాతం పైగా వృద్ధిని సాధించామన్నారు. గతంలో ఉపాధి హామీ వేతనం సరాసరి రూ.300 కాగా దానిని ప్రభుత్వం రూ.307కు పెంచిందన్నారు. ఈ మేరకు గత ఏడాది రూ.300 వేతన సరాసరికి జిల్లాలో రూ.253 సాధించామన్నారు. ఈ ఏడాది పెరిగిన సరాసరి వేతనానికి అనుగుణంగా కనీసం రూ.290 తగ్గకుండా వేతనం కల్పించి ఉపాధి హామీపై మరింత నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన పనులకు రూ.280 సరాసరి వేతనం చెల్లించడం జరిగిందన్నారు.

మద్ది అంజన్నకు పూజలు


ఆంజనేయస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామిని భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకున్నారు. అంజన్నకు ప్రభాతసేవ, నిత్యార్చనలు అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు ఆలయానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,82,553 ఆదాయం వచ్చిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. నిత్యాన్నదాన సత్రంలో 1500 మంది అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు. ఏర్పాట్లను కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

దళితులపై దాడులు దారుణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుంటూరు జిల్లా తెనాలిలో పట్ట పగలు, ప్రజలు చూస్తుండగా ఎస్సీ, మైనారిటీ యువకుల కాళ్లపై సీఐలు రాములు నాయక్, రమేష్ బాబు లాఠీలతో కొట్టడాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తీవ్రంగా ఖండించారు. సీఐలను శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం మంగరాజు విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో దళిత, ప్రజా సంఘాల తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట విజయ్, ప్రియబాబు, నాగేశ్వరరావు ఉన్నారు.

జీలుగ సాగుతో పంటలు బాగు

పాడి - పంట


మండలంలో పెంచిన జీలుగ పంట (ఫైల్)

ముసునూరు: నేల స్వభావానికి అనుగుణంగా పచ్చిరొట్ట ఎరువుల సాయంతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చు. పచ్చిరొట్ట ఎరువు పంటల్లో జీలుగ సాగు చక్కటి ఫలితాలనిస్తుండడంతో చాలా ప్రాంతాల్లో రైతులు జీలుగ సాగుకే మొగ్గు చూపుతున్నారు. నత్రజని, భాస్వరం, పొటాష్, మాంగనీస్ వంటి పోషకాలను పంటలకు విరివిగా అందించే జీలుగను సాగు చేసి లాభాలు పొందాలని ముసునూరు మండల వ్యవసాయాధికారి.కె.చిన సూరిబాబు సూచిస్తున్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో జీలుగ విత్తనాల పంపిణీ చేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయోజనాలు

- పొలంలో జీలుగను కలియ దున్నితే నేలకు సారం, తదుపరి వేసే పంటలకు లాభాలనిస్తుంది.
- నేలలో ఉండే చౌడును నివారిస్తుంది.
- మొక్కలకు రెండు శాతం నత్రజని, సూపర్ ఫాస్పేట్ అదనంగా అందుతుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ ధాతువులను పంటకు అందిస్తుంది.
- నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మారుస్తుంది.
- నేలలో భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి, నేలలోకి నీరు ఇంకే గుణాన్ని పెంచుతుంది.
- పంట పొలంలో నీటి నిల్వ సామర్థ్యం పెంచుతుంది.
- పంట పొలంలో వానపాముల అధిక ఉత్పత్తికి తోడ్పడుతుంది.
- లెగ్యూం జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరంగా ఉంటుంది.
- పొలంలో తుంగ, గరిక వంటి కలుపు మొక్కల పెరుగుదలను అడ్డుకుంటుంది.
- నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్యను మెరుగుపరుస్తుంది.
- వేసవిలో సంభవించే భారీ గాలులు, వర్షాల వల్ల జరిగే నేల కోతను నివారిస్తుంది.
- రసాయనిక ఎరువుల వాడకాన్ని 15 నుంచి 25 శాతం వరకు తగ్గిస్తుంది.
- పంటలపై ఖర్చు ఆదా అవుతుంది.

జీలుగ సాగుకు అనువైన సమయాలు

- ప్రధాన పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగపర్చుకునే విధంగా జీలుగ విత్తనాలు చల్లుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలోనే దుక్కి దున్ని, తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.
- నీటి వసతులు గల ప్రాంతాల్లో వేసవిలోనే సాగు చేయడం లాభదాయకం.
- రెండు పంటల మధ్య కాల వ్యవధిలో కూడా విత్తుకొని కలియ దున్నవచ్చు.
- ఏప్రిల్, మే నెలల్లో ఖరీఫ్ పంటలు వేసే ముందు, తొలకరి వర్షాలు కురవగానే జీలుగ విత్తనాలు విత్తుకోవాలి.
- విత్తిన తర్వాత ఏపుగా పెంచి, పంట జీవ పదార్థాన్ని కలపడానికి, కుళ్లిపోవడానికి నేలలో కలియ దున్నాలి.


చినబాబు, మండల వ్యవసాయాధికారి (ఫైల్)

పోరాటంలో కోకో రైతులు భాగస్వాములు కావాలి

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించి ధర ప్రకటించే విధానం కోసం ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ పోరాటంలో కోకో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరింది. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23న కలెక్టరేట్‌లో జరిగిన చర్చల్లో కంపెనీ ప్రతినిధులు కిలో కోకో గింజలు రూ.450కి మించి కొనుగోలు చేయలేమని చెప్పగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని పేర్కొన్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను 26వ తేదీ సాయంత్రం జారీ చేసినట్టు తెలిపారు. అన్ని కంపెనీల ట్రేడర్లు కిలో కోకో గింజలకు రూ.500 ఇచ్చి ఈ ఆదేశాల ప్రకారం కొనుగోలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. రైతులు అందుకు సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేసి రైతు సేవా కేంద్రాల్లో అందజేయాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని సంజీవ్ నగర్‌లో మంగళవారం నిర్వహించిన ఎక్సైజ్ దాడిలో ఒక మహిళ వద్ద నుంచి రెండు 750 ఎంఎల్ డ్యూటీ పెయిడ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ పునః ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న భక్తులు

అత్తిలి: మండలంలోని కొమ్మర గ్రామంలో శ్రీసీతారామచంద్ర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పంచగవ్య ప్రాశన, మంత్ర హోమం, మన్యుపాశుపత అభిషేకం, మూలమంత్ర హోమం, పుష్పాధివాసం, పంచ శయ్యాధివాస పూజలను పురోహితులు కొంపెల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం ఉదయం 8.24 గంటలకు శ్రీసీతారామచంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్ఠ, అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

మర్యాదపూర్వక కలయిక


వైఎస్ విమలారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మనోజ్‌బాబ్

తణుకు అర్బన్: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనత్త డాక్టర్ వైఎస్ విమలారెడ్డిని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రదర్ ఒ.మనోజ్‌బాబ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తణుకు బేతేలు రిఫార్మ్ చర్చిలో నిర్వహిస్తున్న క్రైస్తవ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు హాజరైన విమలారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు మనోజ్‌బాబ్ వివరించారు.

డీఎస్సీలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ కోటా అమలు చేయాలి

భీమవరం: ప్రస్తుత డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో సీనియర్ స్టేట్‌లెవల్ క్రీడాకారులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంతో అనేక మంది జిల్లాస్థాయి అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని విజ్ఞాన వేదిక కన్వీనర్ అల్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ అభ్యర్థులకు జిల్లాస్థాయి నుంచి స్పోర్ట్స్ సర్టిఫికెట్స్‌తో డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వవగా ప్రస్తుత డీఎస్సీకి కేవలం సీనియర్ స్టేట్ లెవల్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 421 స్పోర్ట్స్ కోటా పోస్టులను భర్తీ చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అందువల్లే సీనియర్ స్టేట్ లెవన్‌స్థాయిని నిర్ణయించారని విమర్శించారు. ఈ నెల 31వ తేదితో దరఖాస్తు గడువు ముగుస్తున్నందున ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాస్థాయి సర్టిఫికెట్స్ పొందిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

విస్సాకోడేరు ఇళ్ల లేఅవుట్ పరిశీలన


ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

పాలకోడేరు: పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామం పైపులు చెరువు వద్ద 2021 సంవత్సరం పేదల ఇళ్ల నిర్మాణం కోసం పట్టాలు ఇచ్చిన లేఅవుట్ స్థలాన్ని మంగళవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా విస్సాకోడేరు గ్రామం పైపులు చెరువు వద్ద 7.64, ఎకరాలలో భాగంగా విస్సాకోడేరు గ్రామానికి చెందిన 164 మంది లబ్ధిదారులకు, వేండ్ర గ్రామానికి చెందిన 127, లబ్దిదారులకు ప్రభుత్వం ఇళ్లపట్టాలను ఇవ్వగా వారిలో 29 మంది లబ్ధిదారులు మాత్రమే ఇల్లు కట్టుకోగా మిగిలిన లబ్ధిదారులు ఎందుకు ఇల్లు నిర్మించుకోలేదని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్లు అయ్యాయా? లేదా? అని సంబంధిత అధికారులను అడిగారు.

కలుషిత నీటితో రోగాలు జాస్తి

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో పలు ప్రాంతాలు ప్రజలు కలుషిత నీటితో ఇక్కట్లు తప్పడం లేదు. స్థానిక 28వ వార్డు టీచర్స్ కాలనీ ప్రాంతంలో కోడె వెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాల వెనుక శివారు వీధిలో పురపాలక సంఘం అందజేసే తాగు నీటి కుళాయిల నుంచి మురికి నీరు వస్తుందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని సమయాల్లో తోక పురుగులు, నల్లటి బురద నీరు, కొన్ని సందర్భాలలో కంకర రంగు నీరు, దుర్వాసన రావడంతో అక్కడి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పైపులైన్ల కనెక్షన్లతోనే సమస్య

టీచర్స్ కాలనీ ప్రాంతంలో గతంలో పాత పైపు లైన్ వ్యవస్థఉండేది. వాటి స్థానంలో కొత్త పైపు లైన్లువేశా రు. 6 నెలల క్రితం కొత్త లైన్లకు ఇళ్లకు వెళ్లే కనెక్షన్లు కలిపారు. అప్పటి నుంచి భూమిలో ఉండే ప్రధాన పైపులైన్‌కు, అక్కడి నుంచి ఇళ్లలోకి వెళ్లే కనెక్షన్లలో సమస్య ఏర్పడి ఉండొచ్చని, లేని పక్షంలో లీకేజీల కారణంగా మురుగు నీరు వస్తుందని చెబుతున్నారు. వర్షా కాలమైతే కుళాయిల నుంచి పలు రంగుల్లో తాగునీరు వస్తుందని, ఒక ఇరవై నిమిషాల పాటు రంగులు మారిన నీరు వస్తుందని, అనంతరం కొంత సేపు కొద్దిపాటి తేటగా ఉన్న నీరు వస్తున్నప్పటికీ ఆ నీటిని తాగునీటిగా ఉపయోగించేందుకు భయపడుతున్నామని అంటున్నారు.


టీచర్స్ కాలనీలో కుళాయి నుంచి వస్తున్న మురుగు నీరు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఎంతోకాలంగా ఈప్రాంతంలో కలుషిత నీటి సమస్య ఉంది. గతంలో పాత పైపులైన్‌లో స్థానంలో కొత్త పైపులైన్లు వేశారు. లీకేజీలు, ఇతర కారణాలతో కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తుంది. కలుషిత నీరు వస్తుందని అధికారులకు తెలియజేశాం. మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.

– పి.పృథ్వీరాజ్, స్థానికుడు, టీచర్స్ కాలనీ

వ్యాధులు వస్తాయని భయపడుతున్నాం

తాగునీరు కలుషితం కావడం వలన విష జ్వరాలు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. తమ సమస్యను పురపాలక సంఘ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు.

డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ


కావలిపురం పంచాయతీలో తనిఖీలు చేస్తున్న డీఎల్‌పీవో

ఇరగవరం: మండలంలోని కావలిపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారిణి జోతిర్మయి తనీఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి కార్యదర్శి ఎం.యుగంధర్ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జోతిర్మయి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఎం.యుగంధర్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోఈ తనీఖీలు చేపట్టామన్నారు. పంచాయతీ బిల్లులు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసుకోవడం, సమాచారం అడిగిన వారికి సరిగా సమాధానం చెప్పకపోవడం వంటివి చేస్తున్నారని ఆరోపణలు. ఈతకోట గ్రామానికి చెందిన చిట్టిరాజు కార్యదర్శిని సమాచారం కోరగా సమాచారం ఇవ్వకపోగా దానికి ఎంత ఖర్చవుతుందని అడిగిన సమాచారం ఎన్ని పేజీలు ఉంటుందో తెలియకుండా అతడిని వేలల్లో డబ్బులు కట్టమన్నారు. దీంతో చిట్టిరాజు ఉన్నతాధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో విచారణ చేశామని డీఎల్‌పీవో తెలిపారు. ఈవిచారణ నివేదికను డీపీవో, జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఏవో శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

అహల్యాబాయ్ హోల్కర్ జీవితం ఆదర్శనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇండోర్ మరాఠా మహారాణి అహల్యాబాయ్ హోల్కర్ జీవితం ఆదర్శనీయమని బీజేపీ నాయకులు అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఎందరో మహనీయుల చరిత్రను అధ్యయనం చేసి వారి జీవిత విశేషాలను వెలికి తీయడం, ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా పట్టణంలో మంగళవారం రామచంద్రరావుపేటలోని కృష్ణుడు చెరువు వద్ద మహిళలతో అహల్యాబాయ్ హోల్కర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయ్‌కు నేతలు ఘన నివాళులర్పించారు. బీజేపీ నాయకులు నార్ని తాతాజీ, ఈతకోట తాతాజీ, అయినంపూడి శ్రీదేవి, కోట రాంబాబు, దువ్వా శ్రీనివాస్, వర్తనపల్లి కాశీ, చిట్యాల రాంబాబు, తుమరాడ చిన్న పాల్గొన్నారు.

దివ్యాంగులను బడిలో చేరుద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడి బయట ఉన్న దివ్యాంగులను బడిలో చేరుద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపులో భాగంగా మంగళవారం 8వ వార్డు గ్రామ సచివాలయం పరిధిలో దివ్యాంగుల పిల్లలను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ భవిత సెంటర్ దివ్యాంగుల పిల్లలకు అండగా ఉంటుందని చెప్పారు. పిల్లల సంరక్షణకు చట్టాలు ఉన్నాయని తెలిపారు. అనేక సంక్షేమాలతో పాటు దివ్యాంగులకు ఉద్యోగాల్లో రాయితీ లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగులకు పలు రకాల అలవెన్సులు, ఉపకరణాలు, బోధన సామగ్రి అమలులో ఉన్నాయని చెప్పారు. పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిత సెంటర్ నిర్వాహకులు బాల ఈశ్వరయ్య, మహిళా పోలీస్ పి.మంజుల, ఎ.పద్మావతి, కృష్ణవేణి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఉపాధి కూలీలు ఐక్యం కావాలి

అత్తిలి: ఉపాధి హామీ చట్టం కూలీలకు ఒక వరం లాంటిదని, దీన్ని కాపాడుకునేందుకు కూలీలు ఐక్యం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ కోరారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా మంగళవారం అత్తిలి మండలం కంచుమర్రు, ఈడూరు గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసల నివారణకు ఉన్న ఊరిలోనే పని కల్పించేందుకు దేశ వ్యాప్తంగా 2005లో ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరంతరం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ద్వారా తిప్పి కొడుతూ ఉపాధి హామీ పరిరక్షణకు పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో దొంగ నాగ శ్రీనివాసరావు, షేక్ రహీం, సరేళ్ళ కనకరాజు, బింకం రాజబాబు, నేలపాటి ప్రసన్నకుమారి, నేలపాటి లీలా భరణి, వేలుపూరి వెంకట నాగకుమారి, నంద్యాల దుర్గాభవాని, స్వామి, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు

సైబర్ నేరాలపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సైబర్ నేరాలు–ఆన్‌లైన్ భద్రత, పలు సమస్యలను ఎదుర్కోవడం వంటి అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యు.చంద్రిక మాట్లాడుతూ బాలికలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఓటీపీ, బెట్టింగ్, గిఫ్ట్ ఓచర్లు వంటి మోసాలకు పాల్పడతారని, అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పడాల సచివాలయం పరిధి శ్రీరామ్ నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోనూ కిశోర బాలికలకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. మాధవరం సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి, మహిళా పోలీసు సీహెచ్ రజనీకుమారి, ఏఎన్‌ఎం రాజేశ్వరి, జీఎంఎస్‌కే బి.సత్యవతి, అంగన్‌వాడీ హెల్పర్లు ఆదిలక్ష్మి, తేజ, బేబి, కిశోర బాలికలు పాల్గొన్నారు.


కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

వరాల వెంకన్న కల్యాణ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

అత్తిలి: బుల్లి తిరుపతిగా పేరుగాంచిన ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీస్వామి వారి కల్యాణోత్సవాలు జూన్ 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ పనులు చేస్తున్నారు.

కల్యాణ బ్రహ్మోత్సవ వివరాలు

జూన్ 4న ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం శ్రీవరాల వేంకటేశ్వరస్వామిని, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. రాత్రి అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, వాస్తుహోమ పూజలు నిర్వహిస్తారు. 5వ తేదీన హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం గజవాహన సేవ, అల్లూరి సీతారామరాజు, మీనాక్షి దంపతులచే వైఖానస ఆగమం ప్రకారం వాడపల్లి శేఖరాచార్యులు, విఖన్‌బాబు పర్యవేక్షణలో శ్రీస్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. 6వ తేదీన తీర్థ మహోత్సవం, అన్నసమారాధన, రథోత్సవం కార్యక్రమాలు, 7న సింహవాహన సేవ, 8న సుదర్శన హోమం, గరుడ వాహన సేవ, 9న శేషవాహన సేవ, 10న చక్రస్నాన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల వెంకటనారాయణ, ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు తెలిపారు.


విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

దౌర్జన్యంగా పాక తొలగింపు

ఆకివీడు: స్థానిక పెదపేటకు చేర్చి ఉన్న ఖాళీ స్థలంలో మునిసిపల్ కార్యాలయం నిర్మించేందుకు ఇటీవల నగర పంచాయతీ అధికారులు ముందుకు వెళ్లగా, ఆ స్థలం తమ క్రైస్తవ సంస్థకు చెందినదని దళితులు కోర్టులో కేసు వేశారు. కమిషనర్ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్, మరికొంత మంది సిబ్బంది కొడవళ్లు, ఇతర వస్తువులతో వచ్చి పాకను తొలగిస్తుండగా దళితులు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది. కమిషనర్ ఆదేశాల మేరకు తొలగిస్తామని సిబ్బంది చెప్పడంతో ఈ అంశం కోర్టులో ఉండగా ఎలా తొలగిస్తారని మహిళలు, క్రైస్తవ యువకులు అడ్డుకున్నారు. ఇదే సమయంలో మహిళపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేతులతో నెట్టివేశారని ఆవేదన చెందుతూ మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని నగర పంచాయతీ అధికారులు పోలీసులకు తెలియజేయడంతో ఈ ప్రాంతానికి పోలీసులు వచ్చి శానిటరీ సిబ్బందిని అక్కడ నుంచి తీసుకు వెళ్లిపోయారు. అనంతరం ఆ ప్రాంత నాయకుడు, పాస్టర్ గూడపాటి జోసఫ్‌రాజు, కౌన్సిలర్లు వంగా జోత్స్న దళితుల్ని సముదాయించి, సిబ్బంది పంపించి వేశారు. అనంతరం తనపై తాకరాని ప్రాంతంలో చేతులు వేసి నెట్టివేశారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్‌పై మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


తాడేపల్లిగూడెం (టీఓసీ): అట్టలతో బొమ్మలు తయారీ చేసిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులచే అట్టలతో వివిధ బొమ్మలు తయారు చేశారు. రిసోర్స్‌పర్సన్స్‌చే ఆసక్తికరంగా శిక్షణా తరగతులు నిర్వహిచారు. రిసోర్స్‌పర్సన్లు ప్రత్తి వీరాస్వామి, ఎ.జనార్ధనరావు, కోపల్లె శ్రీనివాస్‌రావులచే కథలు, ఆటలు ఆడించడం, నీతికథలు, కేవీ సత్యప్రకాష్‌చే ఇంగ్లీషు గ్రామర్, వి.జనార్ధన్‌రావుచే వేమన పద్యాలు, జి.బాపయ్యశర్మచే రామకృష్ణ పరమ హంస, స్వామి వివేకానంద జీవిత విశేషాలను చెప్పారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నెహ్రూ, కందుకూరిలకు ఘన నివాళి

అత్తిలి: భారత దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని మంగళవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో భాగంగా నెహ్రూ, వీరేశలింగం చిత్రపటాలకు గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. శతక పద్యాలు, యోగాపై రిసోర్సు పర్సన్ కె.కోమలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, ఆర్.దానకృష్ణ, వై.ప్రసాద్, సీహెచ్ లలిత, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.


అత్తిలి: జవహర్ లాల్ నెహ్రూ, వీరేశలింగం చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. డిపో నుంచి నడుస్తున్న సర్వీసులకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు, ఫిర్యాదులు, సలహాలు ఉన్నా 99592 25484 నంబరులో ఉదయం 9 నుంచి 10 గంటల లోపు సంప్రదించాలని కోరారు. ఆర్టీసీ ద్వారా మరిన్ని మెరుగైన సేవలు అందించే విధంగా ప్రయాణికులు సహకరించాలని కోరారు.

జూన్ 5న సర్వసభ్య సమావేశం

అత్తిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 5వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీవో పి.శామ్యూల్ తెలిపారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జూన్ 5 ఉదయం 10 గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఆస్పత్రి సలహా మండలి ప్రమాణ స్వీకారం

తాడేపల్లిగూడెం : స్థానిక ఏరియా ఆసుపత్రి సలహా మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నూతన కమిటీతో ప్రమాణ స్వీకారాన్ని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేయించారు. ఆసుపత్రి సూపరింటెండెంటు తాతారావు, డీసీహెచ్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్

తాడేపల్లిగూడెం: వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 29 వ తేదీన తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం గ్రామం నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు ఉద్యానవర్సిటీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ కె.గోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు.

ముగిసిన లలిత కళల శిక్షణ

భీమవరం: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత, భావ వ్యక్తీకరణను పెంపొందించేందుకు లలిత కళలు ఎంతగానో దోహదం చేస్తాయని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం భీమవరం పట్టణం ఏఎస్‌ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 25 రోజులపాటు నిర్వహించిన ఉచిత లలిత కళల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కేంద్రం సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు, వేగేశ్న రమణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, ఎంఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో మున్సిపల్ ఆర్‌డీ పర్యటన

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగ నర్సింహరావు సందర్శించారు. కార్యాలయంలో ఆయా శాఖల పని తీరు, కార్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పట్టణంలో మురుగు డ్రెయిన్లలో పూడికతీత పనుల్ని పరిశీలించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(ఆసుపత్రి)వద్ద ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు.

జూన్ 2న ధర్నాను విజయవంతం చేయాలి

పెంటపాడు: ఇళ్ల స్థలాల కోసం జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం ఆకుతీగపాడు గ్రామంలో సమావేశం వంకా అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ మేరకు జూన్ 2న అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలాలపై అపహాస్యం చేసిన చంద్రబాబు పేదలకు నేటికీ ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కొణతాల నాగరాజు, సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కళింగ లక్ష్మణరావు

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం, ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ, మహిళా సమాఖ్య, ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులచే ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలు ఇప్పటికే ఇళ్ళ కోసం పలు సచివాలయాల్లో వ్యక్తిగత అర్జీలు సమర్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.


ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

యోగా నిత్య జీవితంలో భాగం కావాలి

తాడేపల్లిగూడెం రూరల్: యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకు యోగా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం పలు యోగాసనాల ప్రాముఖ్యతను యోగా శిక్షకులు కరిబండి రామకృష్ణ తెలిపారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎలక్ట్రికల్ ఏఈ రామకృష్ణ, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, ప్రిన్సిపల్ రత్నాకరరావు, పతంజలి యోగా ధ్యాన మందిర నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


యోగా కార్యక్రమం నిర్వహిస్తున్న తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్

ఆటో డ్రైవర్‌కు కేంద్రమంత్రి ఆర్థిక సహాయం

భీమవరం: పట్టణంలోని నర్సయ్యఅగ్రహారంలో ఈదురుగాలులు, భారీ వర్షానికి ఆటోపై చెట్టు కూలిన ఘటనలో ఆర్థికంగా నష్టపోయిన ఆటో డ్రైవర్‌కు కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆటో డ్రైవర్ ఏలూరి వినోద్‌కుమార్‌కు ఆటో మరమ్మతుల నిమిత్తం తన వంతు ఆర్థిక సహాయంగా రూ. 25 వేలను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి చేతుల మీదుగా వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నార్ని తాతాజీ, కలిదిండి వినోద్ వర్మ, కాగిత సురేంద్ర, షేక్ మొహిద్దిన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో రైల్వే సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని రైల్వేకు సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను కోరారు. మంగళవారం భీమవరంలోని శ్రీనివాసవర్మ నివాసంలో కలిసి వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

వైభవంగా చండీహోమం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు మంగళవారం చండి హోమం నిర్వహించారు .45 మంది దంపతులు ఈ హోమం లో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.